



జిల్లా పర్యటనకు విచ్చేసిన సందర్భంగా గుత్తిలో టిడిపి అభిమానులకు అభివాదం చేస్తున్న మంత్రి నారా లోకేష్

చినుకుపడితే గుబులు



ప్రజాశక్తి కాలనీలో నీటిలో చిక్కుకున్న బాలున్ని బయటకు తీసుకుని వస్తున్న రెస్క్యూ టీం

- 'అనంత'ను భయపెడుతున్న వర్షం
- వానొస్తే కాలనీలు జలమయం
- గురువారం నాడు మూడు కాలనీల్లోకి నీరు
- రెస్క్యూ చేసి కాపాడిన అగ్నిమాపక సిబ్బంది



మహిళను నీటి నుంచి బయటకు తీసుకొస్తున్న రెస్క్యూ టీం



నీట మునిగిన ప్రాంతాన్ని పరిశీలిస్తున్న జాయింట్ కలెక్టర్

ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి

అనంతపురం నగర శివార్లలో చినుకుపడితే ప్రజల్లో గుబులు పుడుతోంది. ఎప్పుడు ఏ కాలనీలోకి నీరొచ్చి ముంచేస్తుందోనన్న భయం వెంటాడుతోంది. వరుసగా ఇటువంటి ఘటనలే ఇటీవలి కాలంలో చోటు చేసుకుంటున్నాయి. అనంతపురం జిల్లా కేంద్రంతో పాటు, సరిహద్దు గ్రామాల్లో బుధవారం రాత్రి వర్షం దంచికొంట్టింది. అర్ధరాత్రి తర్వాతతో ఉరుములు, మెరుపులతో కూడిన భారీ వర్షం పడింది. గురువారం ఉదయం 5 గంటల వరకు వర్షం కొనసాగింది. వర్షం ధాటికి అనంతపురం నగర శివారులోని పలు కాలనీలు జలమయం అయ్యాయి. ఇళ్లలోకి నీరు చేరింది. ఉన్నఫలంగా నీరు చేరడంతో ప్రజాశక్తి నగర్, సిపిఐ కాలనీ, కక్కలపల్లి ప్రాంతాల్లో ఇళ్లలోకి నీరు చేరింది. దీంతో కట్టుబట్టలతో జనం బయటకు రావాల్సి వచ్చింది. నీటిలో చిక్కుకున్న పిల్లలు, వృద్ధులను అగ్నిమాపిక సిబ్బంది బయటకు తీసుకొచ్చారు. గురువారం రాత్రి కూడా వర్షముందని వాతావరణ శాఖ హెచ్చరికలు జారీ చేయడంతో లోతట్టు ప్రాంతాల్లో ఉంటున్న వారు బిక్కుబిక్కు మంటూ ఉంటున్నారు.



రాప్తాడు వద్ద ప్రవహిస్తున్న పండమేరు వంక

నగర శివారు కాలనీలు జలమయం

అనంతపురం జిల్లాలో గురువారం తెల్లవారుజామున ఈదురు గాలులతో కూడిన వర్షం పడింది. అత్యధికంగా రాప్తాడు మండలంలో 141.2 మిల్లీమీటర్లు వర్షపాతం నమోదయింది. ఇంత పెద్దఎత్తున వర్షం పడటంతో రాప్తాడు దిగువ భాగంలోనున్న గంగులకుంట, జంగాపల్లి చెరువులు నిండి కిందకు ప్రవహించాయి. ఈ సమయంలో కల్వర్టుల్లో పిచ్చిమొక్కలతో నిండిపోయి ఉండటంతో నీరు పక్కన్ను సిపిఐ కాలనీలోకి చేరాయి. ఉన్నఫలంగా నీరు కాలనీలోకి చేరడంతో ఇళ్లలోని నిత్యావసరాలన్నీ నీటిలో మునిగాయి. భయపడిన స్థానికులు సమాచారాన్ని అగ్నిమాపక శాఖకు తెలియజేయడంతో రెస్క్యూటీమ్‌లు అక్కడికి చేరుకుని వృద్ధులు, పిల్లలను బయటకు తీశారు. ఇదే పరిస్థితి దిగువనున్న లేపాక్షి కాలనీలోకి నీరు చేరి జలమయంగా మారింది. కక్కలపల్లి, ప్రజాశక్తి కాలనీలకు ఆనుకుని ఉన్న ప్రజాశక్తి నగర్‌లో వంకలు ఉధృతంగా ప్రవహించాయి. సమాచారం తెలిసిన వెంటనే రెవెన్యూ, విద్యుత్ శాఖలు అప్రమత్తమై సహాయక చర్యలు చేపట్టారు. ఇళ్లలోకి నీరు చేరిన వారికి భోజన వసతిని కల్పించారు.

రాప్తాడులో అత్యధికం

అనంతపురం జిల్లాలో చూసినప్పుడు గురువారం తెల్లవారుజామున అత్యధికంగా రాప్తాడు మండలంలో వర్షపాతం నమోదయింది. 141.2 మిల్లీమీటర్లు వర్షపాతం నమోదయింది. ఆ తరువాత కళ్యాణదుర్గంలో 53.2 మిల్లీమీటర్లు వర్షపాతం నమోదయింది. ఆత్మకూరు మండలంలో 38 మిల్లిమీటర్లు, బ్రహ్మసముద్రంలో 35, బుక్కరాయసముద్రం 34, శెట్టూరు 27.6, పామిడి 26.4, నార్పలలో 25.6, అనంతపురం 24.6 మిల్లీమీటర్ల వర్షం పడింది. జిల్లా వ్యాప్తంగా 16.9 మిల్లీమీటర్లు సగటు వర్షపాతం నమోదయింది.

నిత్యావసరాలన్నీ తడిచిపోయాయి

బుధవారం అర్ధరాత్రి నుంచి వర్షం జోరుగా కురిసింది. గురువారం తెల్లవారుజామున ఇళ్లలోకి నీరు చేరింది. బియ్యం, బట్టలు అన్నీ తడిచిపోయాయి. కట్టుబట్టలతో బయటపడాల్సి వచ్చింది. ఎగువ భాగంలో వర్షం బాగాపడటంతో కల్వర్టుల వద్ద నుంచి కాలనీలోకి నీరు చేరాయి.

లక్ష్మిదేవి, బాధితురాలు, ప్రజాశక్తి కాలనీ.

కార్యకర్తలకు అండగా ఉంటాం

- విద్యా, ఐటి శాఖల మంత్రి నారా లోకేష్
- గుత్తిలో కార్యకర్తలతో సమావేశం
- నేడు బేతాపల్లి వద్ద రెన్యూ విండ్ ఎనర్జీ ప్రారంభోత్సవం



ప్రజాశక్తి-గుత్తి, అనంతపురం

అధికారంలో లేని సమయంలో పార్టీ కోసం పని చేసిన ప్రతి కార్యకర్తను గుర్తుంచుకుని వారి అభివృద్ధికి కృషి చేయనున్నట్లు రాష్ట్ర విద్యా, ఐటి శాఖ మంత్రి నారా లోకేష్ స్పష్టం చేశారు. మూడు రోజుల పర్యటనలో భాగంగా అనంతపురానికి గురువారం ఆయన విచ్చేశారు. గుత్తి మండల పరిధిలోని బేతాపల్లి గ్రామంలో ఏర్పాటు చేసిన హెలిప్యాడ్‌కు గురువారం మధ్యాహ్నం 1.25 నిమిషాలకు చేరుకున్నారు. హెలీప్యాడ్ వద్ద నారా లోకేష్‌కు రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రి పయ్యావుల కేశవ్, ప్రభుత్వ విప్ కాలవ శ్రీనివాసులు, అనంతపురం, హిందూపురం ఎంపీలు అంబికా లక్ష్మీ నారాయణ, పార్థసారథి, ఎమ్మెల్యేలు గుమ్మనూరు జయరామ్, బండారు శ్రావణిశ్రీ, దగ్గుపాటి వెంకటేశ్వర ప్రసాద్, పల్లె సింధూరరెడ్డి, కలెక్టర్ వినోద్ కుమార్, ఎస్పీ జగదీష్, జేసీ శివ నారాయణ శర్మ, అనంతపురం జిల్లా తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు వెంకట శివుడు యాదవ్, ఆర్టీసీ రీజనల్ ఛైర్మన్ పూల నాగరాజు తదితరులు పుష్పగుచ్ఛాలు అందజేసి ఘన స్వాగతం పలికారు. అనంతరం బేతాపల్లి గ్రామం నుంచి భారీ కాన్వాయ్ ద్వారా గుత్తి అర్ఎస్ నుంచి గుత్తి పట్టణం మీదుగా పట్టణ శివార్లలో మాసినేని పాఠశాల వద్ద ఏర్పాటు చేసిన శిబిరానికి లోకేష్ చేరుకున్నారు. సాయంత్రం 4 గంటల నుంచి టీడీపీ ఉత్తమ కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చేందుకు కషి చేసిన పార్టీ నాయకులు, కార్యకర్తలకు ప్రశంస పత్రాలు అందజేసి అభినందించారు. కార్యకర్తల అందరికీ అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. అనంతరం పార్టీ నాయకులతో మంత్రి లోకేష్ భేటీ అయ్యి గుంతకల్లు నియోజకవర్గంలో పార్టీ స్థితి గతులను అడిగి తెలుసుకున్నారు. పార్టీ పటిష్టతకు కషి చేయాలని నాయకులకు మంత్రి లోకేష్ సూచించారు. శుక్ర, శనివారాలు రెండు రోజులు కూడా నారా లోకేష్ జిల్లాలో ఉండనున్నారు. ప్రభుత్వ కార్యక్రమాల్లో పాల్గొనడంతో టిడిపి నాయకులు, కార్యకర్తలతో సమావేశాలు నిర్వహించనున్నారు.

నేడు రెన్యూ విండ్ ఎనర్జీ ప్రారంభోత్సవం

గుత్తి మండలం బేతాపల్లి వద్ద ఏర్పాటు చేస్తున్న రెన్యూ విండ్ ఎనర్జీ (జెఎఎంబి) ప్రైవేట్ లిమిటెడ్ ప్రారంభోత్సవ కార్యక్రమంలో నారా లోకేష్ శుక్రవారం పాల్గొనున్నారు. ఇందుకు సంబంధించిన ఏర్పాట్లను ఇప్పటికే అధికారులు పూర్తి చేశారు. ఈ కార్యక్రమం అనంతరం ఆయన అనంతపురం వెళ్తారు. అక్కడ కళ్యాణదుర్గం ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు కూతురు వివాహ మహోత్సవంలో పాల్గొని నూతన వధూవరులను ఆశీర్వదిస్తారు. సాయంత్రం అనంతపురం అర్బన్ టిడిపి నాయకులు, కార్యకర్తలతో సమీక్ష నిర్వహిస్తారు. శనివారం నాడు అనంతపురం జెఎన్‌టియులో నిర్వహించే 14వ స్నాతకోత్సవంలో గవర్నర్ అబ్దుల్ నజీర్‌తో కలిసి పాల్గొంటారు.

మడకశిర ఛైర్మన్‌పై నెగ్గిన అవిశ్వాసం

టిడిపి వశం కానున్న నగర పంచాయతీ



అవిశ్వాసానికి మద్దతుగా చేయి ఎత్తి ఓటు వేస్తున్న ఎమ్మెల్యే ఎంఎస్.రాజు, కౌన్సిలర్లు

ప్రజాశక్తి-మడకశిర

మడకశిర మున్సిపల్ ఛైర్‌పర్సన్, వైస్ ఛైర్మన్లపై ప్రవేశపెట్టిన అవిశ్వాత తీర్మానం నెగ్గింది. మెజార్టీ కౌన్సిలర్లు అవిశ్వాసానికి మద్దతుగా ఓటేశారు. దీంతో ప్రస్తుత ఛైర్మన్, వైస్ ఛైర్మన్లు వారి పదవులను కోల్పోయారు. మడకశిర నగర పంచాయతీ కార్యాలయంలో అవిశ్వాస తీర్మానం కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎక్స్ అఫీషియో సభ్యుని స్థానంలో ఎమ్మెల్యే ఎంఎస్.రాజుతో పాటు కౌన్సిలర్లు పాల్గొన్నారు. మడకశిర నగర పంచాయతీలో 20 మంది కౌన్సిలర్లు ఉండగా 14మంది కౌన్సిలర్లు అవిశ్వాసానికి మద్దతుగా చేతులు ఎత్తి ఆమోదం తెలిపారు. ఎక్స్ అఫీషియో సభ్యుని ఓటుతో కలిసి అవిశ్వాసానికి 15 ఓట్లు పడ్డాయి. మిగిలిన ఆరుగురు వైసిపి కౌన్సిలర్లు సమావేశానికి గైర్హాజరయ్యారు. గత మున్సిపల్ ఎన్నికల్లో వైసిపి అత్యధిక స్థానాల్లో గెలుపొంది మడకశిర నగర పంచాయతీని కైవసం చేసుకుంది. 2024 సార్వత్రిక ఎన్నికల్లో రాష్ట్రంలో టిడిపి విజయం సాధించడంతో పరిస్థితులు మారాయి. ఎమ్మెల్యే ఎంఎస్.రాజు, మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామి ఆధ్వర్యంలో మెజార్టీ వైసిపి కౌన్సిలర్లు టిడిపిలో చేరారు. దీంతో ఛైర్మన్‌పై అవిశ్వాస తీర్మానం పెట్టారు. అవిశ్వాసం తీర్మానం నెగ్గడంతో త్వరలో టిడిపి మద్దతుతో ఛైర్మన్, వైస్ ఛైర్మన్ల ఎన్నిక జరగనుంది. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్లు నరసింహారాజు, ఉమా శంకర్, శ్రీనివాసులు, వెంకట లక్ష్మమ్మ, ఓబులమ్మ శ్రీనివాస్, శంకర్ నాయక్, లక్ష్మయ్య, ప్రభావతి హనుమంతు , ప్రియాంక విక్రమ్, పార్వతమ్మ దాసప్ప, సుజాత మేఘన రమేష్, సుభద్ర నాగేంద్ర, సావిత్రమ్మ బలరాం, సిద్ధప్ప, పాల్గొన్నారు.

4వేల మెగావాట్లతో ఇంధన ప్రాజెక్టు

ఏర్పాటుకు భూసేకరణ చేయండి : కలెక్టర్ టిఎస్ చేతన్



సమీక్ష సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ చేతన్

ప్రజాశక్తి-పుట్టపర్తి అర్బన్

జిల్లాలో 4 వేల మెగావాట్ల పునరుత్పాదక ఇంధన ప్రాజెక్టు స్థాపనకు అవసరమైన భూ సేకరణకు జాబితా సిద్ధం చేయాలని కలెక్టర్ టిఎస్.చేతన్ సంబంధిత అధికారులను ఆదేశించారు. గురువారం స్థానిక కలెక్టరేట్లో ఇంధన ప్రాజెక్టుకు భూ సేకరణకు సంబంధించి జాయింట్ కలెక్టర్ అభిషేక్ కుమార్‌తో కలిసి అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ న్యూ అండ్ రెన్యువబుల్ ఎనర్జీ డెవలప్మెంట్ కార్పొరేషన్ ఏపీ లిమిటెడ్ ఆధ్వర్యంలో ఇంధన ప్రాజెక్టు స్థాపనకు తగిన భూమి సేకరించాల్సి ఉందన్నారు. సంబంధిత ఆర్డీవోలు, తహశీల్దార్లు ఆయా మండలాల్లో ప్రభుత్వ భూమి ఎంత ఉంది.. భూమిని లీజుకు ఇచ్చే రైతులు వివరాలు సేకరించాలన్నారు. లీజుకు ఇచ్చే రైతులకు ఎకరాకు ఏడాదికి రూ.31 వేలను ప్రభుత్వం అందిస్తుందన్నారు. అటువంటి రైతులను గుర్తించి భూ సేకరణ సిద్ధం చేయాలన్నారు. స్థానిక ఎమ్మెల్యేలు, ప్రజా ప్రతినిధులు, ఆర్డీవోలు, తహశీల్దార్లు అందరూ సమన్వయంతో ఈ పనిని చేసుకోవల్సి ఉందన్నారు. రైతులతో తీసుకునే భూములను బ్లాక్ చేసి మ్యాపులు సిద్ధం చేయాలని సూచించారు. ఈనెల 20వ తేదీలోపు జాబితాలు సిద్ధం చేసి, 22న వీటిపై ప్రత్యేక సమావేశంలో సమీక్షించనున్నట్లు తెలియజేశారు. ముదిగుబ్బ, తలుపుల, రొద్దం, గుడిబండ, కనగానిపల్లి, చిలమత్తూరు, హిందూపురం, అగళి, రామగిరి మండలాల్లో భూ సేకరణను వేగవంతం చేయాలన్నారు. ఈ సమావేశంలో ఆర్డీవోలు శర్మ, మహేష్, ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.

'అశాస్త్రీయ నిర్ణయాలతో పాఠశాల విద్య నిర్వీర్యం'

ప్రజాశక్తి-పెనుకొండ

సంస్కరణల పేరుతో చేస్తున్న అసంబద్ధ, అశాస్త్రీయ నిర్ణయాలతో పాఠశాల విద్య నిర్వీర్యం అయ్యే పరిస్థితులు నెలకొన్నాయని ఎపి స్కూల్ టీచర్స్ అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎంవి. కృష్ణారెడ్డి, జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు మారుతిప్రసాద్, జయకృష్ణ, వర్కింగ్ అసోసియేట్ ప్రెసిడెంట్స్ నరేష్‌కుమార్, మక్కిశెట్టి కుమార్ గురువారం ఓ ప్రకటనలో ఆందోళన వ్యక్తం చేశారు. ప్రభుత్వం 9 రకాల పాఠశాలల పేరుతో ఒక్కో పాఠశాలకు ఒక్కో నిబంధనలు విధించి ఉపాధ్యాయు లను కేటాయించడం సరైంది కాదన్నారు. నాణ్యమైన విద్య అందాలంటే అన్ని పాఠశాలలకు ఒకే రకమైన స్టాఫ్ పాటర్న్ ఉండాలన్నారు. ప్రభుత్వ నిర్ణయాలతో కొన్ని వేల పాఠశాలలు ఏకోపాధ్యాయ పాఠశాలలుగా మారి భవిష్యత్తులో మూతపడే ప్రమాదం లేకపోలేదన్నారు. స్కూల్ అసిస్టెంట్లను ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలలకు కేటాయించి విద్యార్థులకు న్యాయం చేయకుండా నిబంధనలకు విరుద్ధంగా ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయులుగా పంపడం ఏంటని ప్రశ్నించారు. పది మంది దాటిన ప్రతి ఫౌండేషన్ పాఠశాలకు ఇద్దరు ఉపాధ్యాయులను నియమించాలని, బేసిక్ ప్రైమరీ పాఠశాలల్లో 40 మంది దాటితే మూడో పోస్టు ఇవ్వాలని, పాఠశాల సహాయకులను కేవలం ప్రాథమి కోన్నత, ఉన్నత పాఠశాలలకు మాత్రమే కేటాయించాలని, ప్రాథమిక పాఠశాలల ప్రధానోపాధ్యాయ పోస్టులను ఎస్‌జిటిలకు ఉద్యోగోన్నతుల ద్వారా భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. గతంలో ఉద్యోగోన్నతులు పొందిన ఉపాధ్యాయులను ప్రాథమిక పాఠశాలలకు పంపడం సరైన నిర్ణయం కాదన్నారు. 'తల్లికి వందనం' పథకాన్ని ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు మాత్రమే అమలు చేస్తే ప్రభుత్వ పాఠశాలలు బలోపేతం అవుతాయన్నారు. ఉపాధ్యాయ సంఘాల అభిప్రాయాలు పరిగణలోకి తీసుకొని ఉపాధ్యాయుల కేటాయింపు, బదిలీలు, ఉద్యోగోన్నతులు చేపట్టాలని కోరారు.



కియా పరిశ్రమ వద్ద నోటీసు బోర్డు లో సమ్మె నోటీసులు అతికిస్తున్న నాయకులు

కియా పరిశ్రమకు సార్వత్రిక సమ్మె నోటీసు

ప్రజాశక్తి-పెనుకొండ

కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలను నిరసిస్తూ, కార్మిక వర్గానికి తీవ్ర నష్టం జరిగే నాలుగు లేబర్ కోడ్స్ రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 20న కేంద్ర కార్మిక సంఘాలు చేపట్టిన దేశవ్యాప్త సమ్మెను జయప్రదం చేయాలని కోరుతూ కియా కార్ల పరిశ్రమకు సమ్మె నోటీసును సిఐటియు నాయకులు అతికించారు. ఈ సందర్భంగా ఆ సంఘం నాయకులు మాట్లాడుతూ కేంద్రంలోని మోడీ ప్రభుత్వం 29 కార్మిక చట్టాలను సవరించి నాలుగు లేబర్ కోడ్స్ బిల్లులు తీసుకొచ్చి కార్మికుల హక్కులను హరించిందన్నారు. కార్మికుల శ్రమను పెట్టుబడిదారులకు దోచిపెట్టడానికే కార్మిక చట్టాలను సవరించిందని తెలిపారు. లేబర్ కోడ్స్ అమలయితే కార్మికులకు సంఘం పెట్టుకునే హక్కు లేకుండా పోతుందన్నారు. దేశంలో నిరుద్యోగం, పేదరికం పెరిగి ప్రజల కొనుగోలు శక్తి పడిపోయిందన్నారు. మోడీ ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేయకపోగా కార్మిక వర్గం పోరాడి సాధించుకున్న చట్టాలను పెట్టుబడుదారులకు ప్రయోజనం కోసం సవరించడం దారుణమన్నారు. కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలకు నిరసనగా ఈనెల 20న చేపట్టిన సమ్మెలో అన్ని రంగాల ఉద్యోగ,కార్మికులు పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం జిల్లా అధ్యక్షులు హరి, సిఐటియు జిల్లా కోశాధికారి సాంబశివ, మండల కన్వీనర్ బాబావలి, జిల్లా కమిటీ సభ్యులు నాగరాజు పాల్గొన్నారు.

గోరంట్లలో ఫైర్‌స్టేషన్ ఏర్పాటు చేయాలని వినతి

ప్రజాశక్తి-గోరంట్ల

గోరంట్లలో ఫైర్ స్టేషన్ ఏర్పాటు చేయాలని కోరుతూ గురువారం వ్యవసాయ కార్మిక సంఘం, భవన నిర్మాణ కార్మిక సంఘాల ఆధ్వర్యంలో తహశీల్దార్ మారుతికి వినతి పత్రం అందజేశారు. నాయ కులు మాట్లాడుతూ మండల జనాభా, విస్తీర్ణం, గ్రామాల రీత్యా పెద్ద మండలం అని, జిల్లా విభజన అనంతరం కేంద్ర ప్రభుత్వ సంస్థలు, జాతీయ రహదారులు, పరిశ్రమలకు కేంద్ర బిందువుగా అభివృద్ధి చెందిందన్నారు. ఈ ప్రాంతం వాణిజ్య పరంగా కూడా ప్రాధాన్యత సంతరించుకుందన్నారు. ఇటీవల ఓ వస్త్ర దుకాణంలో అగ్ని ప్రమాదం చోటుచేసుకోగా సమాచారం ఇచ్చినా ఫైరింజిన్ చేరుకోలేకపోయిందన్నారు. దీంతో ఆ ప్రమాదంల సుమారు రూ. 50 లక్షల వరకూ నష్టం జరిగిందన్నారు. గతంలో కూడా నాసన్ సంస్థలో అగ్ని ప్రమాదం వల్ల నష్టం జరిగిందన్నారు. మండలంలో ఇప్పటికే అనేక అగ్ని ప్రమా దాలు జరిగి తీవ్ర నష్టం వాటిల్లిందన్నారు. ఈ పరిస్థితుల దృష్ట్యా గోరంట్ల మండలంలో ప్రత్యేకంగా ఫైర్ స్టేషన్ ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉందన్నారు. ఫైర్‌స్టేషన్ ఏర్పాటుకు అవసరమైన చర్యలు, ప్రతిపాదనలను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాలని కోరారు. స్పందించిన తహశీల్దార్ ఈ విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తామని తెలిపారు. కార్యక్రమంలో వ్యకాసం జిల్లా ప్రధాన కార్యదర్శి పెద్దన్న, జిల్లా కమిటీ సభ్యులు స్వర్ణలత, భవన నిర్మాణ కార్మిక సంఘం నియోజకవర్గ కన్వీనర్ కొండా వెంకటేశులు, మండల అధ్యక్ష, కార్యదర్శులు, కోశాధికారి ముద్దల వెంకటరమణప్ప, మహబూబ్‌బాషా, బాబ్‌జాన్, మక్బూల్‌బాషా పాల్గొన్నారు.



తహశీల్దార్ మారుతికి వినతిపత్రం ఇస్తున్న నాయకులు

కెనరా బ్యాంకు ఖాతాదారులకు తప్పని తిప్పలు

ప్రజాశక్తి-రొద్దం

స్థానిక కెనరా బ్యాంక్‌లో లావాదేవీలు జరపాలంటే గంటల తరబడి వేచి ఉండాల్సి వస్తుందని ఖాతాదారులు వాపోతున్నారు. బ్యాంకులో నగదు జమ చేసే వారిని, డ్రా చేసే వారిని కలిపి ఒకే వరుసలో పంపడంతో ఖాతాదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అంతేకాకుండా మహిళలు, పురుషలను ఒకే లైన్‌లో పంపడంతో మహిళలు కొంత అసౌకర్యానికి గురువుతున్నారు. నగదు జమ చేసే కౌంటర్ వద్ద ఇరుకుగా ఉండడంతో రాకపోకలు సాగించేందుకు ఇబ్బందులు తప్పడం లేదు. ప్రధానంగా వృద్ధులు ఎక్కువసేపు లైన్‌లో నిల్చోలేక పడరాని పాట్లు పడుతున్నారు. గతంలో నగదు డ్రా చేసే వారికి టోకెన్ సిస్టం ద్వారా పంపిణీ చేసేవారిని తద్వారా వారి టోకెన్ వచ్చే వరకూ బ్యాంకులో కూర్చునేవారు. ఆ సమయంలో నగదు జమ చేసే వారికి సులువుగా ఉండేది. గతంలో లోచర్లలో కూడా బ్యాంకు ఉండడంతో రద్దీ కాస్త తక్కువగా ఉండేది. సుమారు రెండేళ్ల క్రితం లోచర్లలో బ్యాంకు తీసేయడంతో అక్కడి ఖాతాలను ఇక్కడికి బదిలీ చేశారు. తద్వారా ఖాతాలు పెరగడంతో ఖాతాదా రులకు ఇబ్బందులు పెరిగాయని చెప్పవచ్చు. కావున బ్యాంకు ఉన్నతాధికారులు స్పందించి ఖాతాదారులకు మెరుగైన సేవలు అందించాల్సిన అవసరం ఎంతైనా ఉంది.



రొద్దంలో కెనరా బ్యాంకు బయట వేచి ఉన్న ఖాతాదారులు

లేపాక్షి ఆలయ చిత్రంతో పోస్ట్‌కార్డు

ప్రజాశక్తి-లేపాక్షి

తపాలా శాఖ ఆధ్వర్యంలో శుక్రవారం వీరభద్రస్వామి ఆలయంలో ప్రత్యేక కార్యక్రమం నిర్వహి స్తున్నారు. వీరభద్రస్వామి దేవస్థానం చిత్రంతో రూపొందించిన పోస్టుకార్డు, లేపాక్షి నంది నమూనాతో పర్మినెంట్ పిక్టోరియల్ కాన్సులేషన్‌ను భారత తపాలా శాఖ ఎపి సర్కిల్ చీఫ్ పోస్ట్ మాస్టర్ జనరల్ ప్రకాష్, కర్నూలు రీజియన్ పోస్ట్‌మాస్టర్ జనరల్ డాక్టర్ వెన్నం ఉపేంద్ర విడుదల చేయనున్నారు. కార్యక్రమంలో అధికారులు, ప్రజాప్రతినిధులు, ప్రజలు పాల్గొని విజయవంతం చేయాలని సూపరింటెండెంట్ ఆఫ్ హిందూపురం డివిజన్ పోస్టాఫీసర్ విజయ్‌కుమార్ ఓ ప్రకటనలో కోరారు.

ప్రధాన రహదారికి పక్కనే ప్రమాదకరంగా గుంతలు

ప్రజాశక్తి-రొద్దం



పెనుకొండ-పావగడ ప్రధాన రహదారి పక్కన ఏర్పడిన గుంత

పెనుకొండ-పావగడ ప్రధాన రహదారిలో ఆర్.మరవపల్లి గ్రామంలో తహశీల్దార్ కార్యాలయం వద్ద ప్రధాన రహదారికి ఇరువైపులా కేబుల్ నెట్‌వర్క్‌కు సంబంధించి కాంట్రాక్టర్ కాలువలు తీసి పూడ్చివేశారు. అయితే ఇటీవల వర్షాలు కురుస్తుండడంతో ఆ ప్రాంతంలో మట్టి కుంగిపోయి రహదారి పక్కనే లోతైన గుంతలు ఏర్పడ్డాయి. నిత్యం రద్దీగా ఉండే ఈ ప్రాంతంలో వాహనదారులు ఏమాత్రం ఏమరుపాటుగా వ్యవహరించినా ఈ గుంతల్లో పడే ప్రమాదం ఉంది. ఈ మార్గంలో రోజూ ప్రభుత్వ అధికారులు కూడా రాకపోకలు సాగిస్తుంటారు. ఇకనైనా స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు స్పందిం చి రోడ్డుకు ఇరువైపులా ఏర్పడిన గుంతలను పూర్తిస్థాయిలో పూడ్చాలని గ్రామస్తులు కోరుతున్నారు.

'ఉపాధి' పనులు కల్పించండి : పీడీ

ప్రజాశక్తి-అగళి

మండలంలోని ఉపాధి హామీ కూలీలందరికీ పనులు కల్పించడంతో పాటు కూలీల హాజరు శాతాన్ని పెంచాలని జిల్లా నీటి యజమాని సంస్థ ప్రాజెక్ట్ డైరెక్టర్ విజయేంద్రప్రసాద్ ఆదేశాంచారు. స్థానిక ఎంపిడిఓ కార్యాలయంలో గురువారం పిడి ఉపాధి సిబ్బంది, ఏపీఓతో సమావేశం నిర్వహించారు. పిడి మాట్లాడుతూ ఉపాధి కూలీలకు రోజూ పనులు కల్పించాలన్నారు. అనంతరం పశువుల నీటి తొట్టెలు, పశువుల షెడ్లు, ఫారం పాండ్ల పనులను పరిశీలించారు.

ముగిసిన సమ్మర్ క్యాంప్

ప్రజాశక్తి - పరిగి

మండలంలోని ధనాపురం జడ్పీహెచ్ఎస్ పాఠశాల ఆవరణంలో గత నెల 28 న ప్రారంభమైన సమ్మర్ క్యాంప్ క్రీడా పోటీలు గురువారం ముగిశాయి. క్రీడల సమ్మర్ కోచింగ్ క్యాంపులో భాగంగా సేవమందిర్‌కు చెందిన శ్యాంసుందర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ధనాపురం క్రీడాకారులకు 20 జతల క్రీడా దుస్తులు అందజేశారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతు చదువుతో పాటు క్రీడలలో రాణించిన వారికి తన ప్రోత్సహం ఉంటుందని తెలిపారు. వేసవి సెలవుల్లో ఇలాంటి క్యాంపుల వల్ల విద్యార్థులు క్రీడలకు దగ్గరవుతారని ఇలాంటి కార్యక్రమాలను వినియోగించుకున్న విద్యార్థులు ఆరోగ్యంగా మరింత మెరుగుపడే అవకాశం ఉందని అన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయిని జ్యోతిర్మయి, వ్యాయామ ఉపాధ్యాయుడు మహేష్ దీపక్, పాఠశాల బోధనా సిబ్బంది సుకన్య, ఇందిరమ్మ, పద్మ, శారదమ్మ తదితరులు పాల్గొన్నారు.

క్షయ వ్యాధిపై అవగాహన

ప్రజాశక్తి - పుట్టపర్తి రూరల్

పుట్టపర్తి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని నిడిమామిడి, పుట్టపర్తి లోని చిత్రావతి గుట్ట తదితర ప్రాంతాల్లో అధికారులు అతి సార, క్షయ వ్యాధులపై అవగాహన కల్పించారు. సామాజిక ఆరోగ్య అధికారి నగేష్, డిటిసి సూపర్వైజర్ అబీద్ భాష ఆధ్వర్యంలో అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమములో సూపర్ వైజర్ చంద్రకళ, టిబి హెచ్.వి రాజేశ్వరి, ఆరోగ్య కార్యకర్తలు మంజులవాణి, జ్యోతి, ఆశా కార్యకర్తలు నాగరత్నమ్మ, నిర్మల, మమతాజ్, హసీనా తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి గంగాభవాని ఉత్సవాలు

ప్రజాశక్తి - గాండ్లపెంట

మండల కేంద్రంలో శ్రీ గంగా భవాని 17 వార్షికోత్సవం తిరుణాల ఉత్సవాలు నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు 16వ తేదీ శుక్రవారం కలిసి పూజ, అభిషేకం, 17న శనివారం అమ్మవారి ఊరేగింపు, ప్రత్యేక పూజలు, అన్నదాన కార్యక్రమాలు రాత్రికి ఆర్కెస్ట్రా ఉంటాయన్నారు. 18న ఆదివారం తెల్లవారుజామున అమ్మవారికి జ్యోతులు, బాణాలు, సాయంత్రం ఉట్లు తిరునాళ్ల తదితర కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు

హెచ్ఐవిపై అవగాహన

ప్రజాశక్తి - కదిరి టౌన్

జిల్లా వైద్య ఆరోగ్య శాఖ,జిల్లా ఎయిడ్స్ నివారణ, నియంత్రణ సంస్థ ఆధ్వర్యంలో సరోజమ్మ కళాబృందంతో వీధి నాటకం ద్వారా హెచ్ఐవి పై అవగాహన కల్పించారు . ఈ మేరకు గురువారం కదిరి బస్ స్టాండ్‌లో అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమములో కదిరి ఐసిటిసి కౌన్సిలర్ వెంకటేశ్వర చౌదరి, డిఎస్ఆర్‌సి కౌన్సిలర్ అరుణ, ఎఆర్‌టి కౌన్సిలర్ మల్లికార్జున, వైద్య సిబ్బంది, జన జాగృతి పి.యూ కదిరి ప్రాజెక్ట్ మేనేజర్ ఇ శ్రీనివాసులు, నీరజ, అశ్విని,నిర్మల తదితరులు పాల్గొన్నారు.

అర్హులందరికీ అన్నదాత సుఖీభవ

ప్రజాశక్తి - ధర్మవరం రూరల్

అర్హులైన రైతులందరికీ అన్నదాన సుఖీభవ పథకాన్ని వర్తింపజేస్తామని తెలుగుదేశం పార్టీ క్లస్టర్ ఇంచార్జి మహేష్ చౌదరి, వ్యవసాయ అధికారి ముస్తఫా తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడు తూ గతంలో పట్టాదార్ పుస్తకం ఉన్న రైతు మరణించిన, ఆ కుటుంబంలోని వ్యక్తులకు మరణించిన వ్యక్తి డెత్ సర్టిఫికెట్ తీసుకొని పోతే వారికి కూడా ఆ పథకం వర్తిస్తుందని తెలిపారు. ఇంకా అర్హులైన రైతులు ఉంటే కూడా రైతు సేవా కేంద్రంలోని అధికారులను కలిస్తే వారికీ కూడా అన్నదాత సుఖీభవ పథకం వర్తింపజేసేందుకు చర్యలు తీసుకుంటారని చెప్పారు.

పారా లీగల్ వాలంటీర్ల కోసం దరఖాస్తుల ఆహ్వానం

ప్రజాశక్తి-హిందూపురం

చట్టాలపై ప్రజలకు అవగాహన కల్పించే నిమిత్తం రాష్ట్ర హైకోర్టు ఆదేశాల మేరకు పారా లీగల్ వాలంటీర్ల నియామకం కోసం దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు అదనపు జిల్లా జడ్జి కంపల్లె శైలజ తెలిపారు. హిందూపురం ప్రాంతంలోని మారుమూల గ్రామాల్లో చట్టాలపై అవగాహన కల్పించేందుకు సీనియర్ సిటిజెన్లు, దివ్యాంగులు, హిజ్రాలు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. పదవ తరగతి అందుకు సమానమైన విద్యార్హత కలిగిన ఆసక్తి ఉన్న అభ్యర్థులు ఈ నెల 24వ తేదీలోపు దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఆసక్తి, అర్హత ఉన్న అభ్యర్థులు తమ దరఖాస్తులను హిందూపురం రెండవ అదనపు జిల్లా జడ్జి న్యాయ సముదాయంలో ఉన్న లోక్ అదాలత్ విభాగంలో అందజేయాలన్నారు.

ఉపాధి పనుల పరిశీలన

ప్రజాశక్తి తాడిమర్రి

మండల పరిధిలోని నిడిగల్లు గ్రామంలో చేపడుతున్న ఫారంపాండు పనులను ఏపీవో అనిల్ కుమార్ రెడ్డి గురువారం పనులను పరిశీలించారు. ప్రతికూలికి రోజుకు 307 రూపాయలు ప్రభుత్వం అందజేస్తుందన్నారు. ఆసక్తి ఉన్న రైతులు ఫారం పాండు తొట్టెలను నిర్మించు కోవడం వల్ల భూగర్భ జలాలు పెరుగుదలకు తోడ్పడుతాయని తెలియజేశారు ఈ కార్యక్రమంలో ఫీల్డ్ అసిస్టెంట్ కవిత, కూలీలు పాల్గొన్నారు

కార్డెన్ సెర్చ్

ప్రజాశక్తి - ముదిగుబ్బ

మండల పరిధిలోని రాళ్ల అనంతపురం తండాలో పోలీసులు కార్డెన్ సెర్చ్ నిర్వహించారు. గురువారం ఉదయం ముదిగుబ్బ అప్ గ్రేడ్ సీఐ శివ రాముడు ఆధ్వర్యంలో గ్రామంలోని పలు గృహాలలో తనిఖీలు నిర్వహించారు. రౌడీ షీటర్, ట్రబుల్ హంగర్స్ ఇళ్లతో పాటు మద్యం అక్రమంగా విక్రయించే వారి గృహాలను తనిఖీ చేశారు. గొడవలు, అల్లర్ల జోలికి వెళ్లి జీవితాలు నాశనం చేసుకోవద్దని సీఐ సూచించారు. ఈ కార్యక్రమంలో ముదిగుబ్బ పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు

దేశవ్యాప్త సమ్మెను విజయవంతం చేయండి



పుట్టపర్తిలో కరపత్రాలను విడుదల చేస్తున్న నాయకులు



ముదిగుబ్బలో సమ్మె నోటీసు అందజేస్తున్న నాయకులు, కార్మికులు

ప్రజాశక్తి - పుట్టపర్తి అర్బన్

రైతాంగ, వ్యవసాయ కార్మికులు, ఇతర కార్మిక సంఘాలు ఈనెల 20న నిర్వహించే దేశవ్యాప్త సమ్మెలో పాల్గొని విజయవంతం చేయాలని సిపిఎం, సిఐటియు, రైతు సంఘం, వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు పిలుపునిచ్చారు. గురువారం మున్సిపాలిటీ పరిధిలోని ఎనుములపల్లి గణేష్ సర్కిల్ లో సమ్మెకు సంబంధించిన కరపత్రాలను విడుదల చేశారు. ఈసందర్భంగా రైతుసంఘం జిల్లా అధ్యక్షుడు హరి, కార్యదర్శి జంగాలపల్లి పెద్దన్న, సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఈ ఎస్ వెంకటేష్ మాట్లాడుతూ కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల రైతు, కూలీల, కార్మికుల వ్యతిరేక విధానాలను నిరసిస్తూ ఈనెల 20న దేశవ్యాప్త సమ్మె, నిరసనలు చేపట్టనున్నామన్నారు. వివిధ డిమాండ్ల తో చేపట్టిన ఈ సమ్మెలో అన్ని వర్గాల ప్రజలు పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సిపిఎం సీనియర్ నాయకుడు రామకృష్ణ, పట్టణ కార్యదర్శి బ్యాళ్ల అంజి, వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు సాకే వెంకటేశు, ముత్యాలు, మారుతి, సిపిఎం కార్యాలయ కార్యదర్శి సిద్దు తదితరులు పాల్గొన్నారు.

ధర్మవరం రూరల్ : కార్మికుల సమస్యల పరిష్కారం కోసం ఈనెల 20న నిర్వహించే దేశవ్యాప్త సమ్మెను జయప్రదం చేయాలని సిఐటియు నాయకులు కోరారు. ఈసందర్భంగా ఆసంఘం నాయకులు జెవి. రమణ, ఎస్‌హెచ్ బాషా, అయుబ్ ఖాన్ తదితరులు దేశవ్యాప్తసమ్మెకు సంబందించిన కరపత్రాలను గురువారం విడుదల చేశారు. అనంతరం నాయకులు మాట్లాడుతూ కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్‌కార్మిక విధానాన్ని రద్దుచేసి కార్మికులందరినీ రెగ్యులరైజ్ చేయాలని, ప్రభుత్వ రంగ సంస్థలను కాపాడాలని, ప్రవేటికరణ ఆపాలని, ఎనిమిది గంటల పని విధానాన్ని కొనసాగించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిఐటియు నాయకులు ఎల్. ఆదినారాయణ, బొగ్గు నాగరాజు, అనిల్, రాము, నాగవేణి జయమ్మ, పోతలయ్య, వెంకటస్వామి, తదితరులు పాల్గొన్నారు.

ముదిగుబ్బ : మే 20న నిర్వహించే దేశవ్యాప్త సమ్మె సందర్భంగా పంచాయతీ కార్మికులు అధికారులకు ముందస్తు నోటీసు అందజేశారు. పంచాయతీ కార్యాలయం ఈవో మంజుల, తహశీల్దార్ కార్యాలయం సిబ్బంది సాయి గీతకు ఆవాజ్ కమిటీ ప్రధాన కార్యదర్శి బాబ్జాన్ సిఐటియు, మండల నాయకులు పంచాయతీ కార్మికులు రెవిన్యూ సిబ్బంది వీఆర్ఏలు తదితరులు సమ్మె నోటీసును అందజేశారు.

కోరం లేక

మున్సిపల్ కౌన్సిల్ సమావేశం రద్దు



కౌన్సిలర్లు లేక ఖాళీగా ఉన్న కుర్చీలు

వైసిపి కౌన్సిలర్లు డుమ్మా

చైర్మన్ తీరుపై పార్టీలో ముదురుతున్న ముసలం

ప్రజాశక్తి - పుట్టపర్తి క్రైమ్

పుట్టపర్తి మున్సిపాలిటీ సర్వసభ్య సమావేశానికి వైసిపి కౌన్సిలర్లు మూకుమ్మడిగా గైరాహాజరు కావడంతో కౌన్సిల్ సమావేశం రద్దయింది. గురువారం నిర్వహించాల్సిన ఈ కౌన్సిల్ సమావేశానికి వైసీపీ తరఫున ఎన్నికైన చైర్మన్ తుంగ ఓబుళపతి ఒక్కరే హాజరు కాగా మరో 14 మంది వైసీపీ కౌన్సిలర్లు డుమ్మా కొట్టారు. ఇటీవల చైర్మన్ వ్యవహార శైలి సరిగా లేనందునే ఆ పార్టీ కౌన్సిలర్లు అందరూ మూకుమ్మడిగా గైరాహాజరు కావడం పట్ల పట్టణంలో చర్చనీయాంశం అయింది. చైర్మన్ కౌన్సిలర్ల మధ్య ముసలం ముదురుతోందన్న విషయం బయటపడింది. కోరం లేకపోవడంతో చేసేది లేక చైర్మన్ సమావేశం రద్దు చేశారు. టిడిపి తరఫున ఎన్నికైన ఐదు మంది కౌన్సిలర్లు హాజరయ్యారు. ఈ సందర్భంగా టిడిపి ఫ్లోర్ లీడర్ రత్నప్ప చౌదరి మాట్లాడుతూ చైర్మన్ తప్ప ఒక్క వైసీపీ కౌన్సిలర్ కూడా సమావేశానికి హాజరు కాకపోవడం లో ఆంతర్యం ఏమిటో చైర్మన్ చెప్పాలన్నారు. ఆరు నెలలుగా సరిగా కౌన్సిల్ సమావేశాలు నిర్వహించడంలో చైర్మన్, మున్సిపల్ కమిషనర్ విఫలమయ్యారని పనులు చేసిన కాంట్రాక్టర్లకు బిల్లులు మంజూరు చేయకపోతే ఏ కాంట్రాక్టర్ ముందుకు రారని అన్నారు. ప్రజా సమస్యలు పరిష్కరించేందుకు తీరిక లేకపోతే, పాలన చేత కాకపోతే దిగిపోవడం మంచిదని సూచించారు. ఈ కార్యక్రమంలో టిడిపి కౌన్సిలర్లు పళ్ళ వెంకటరమణమ్మ, లక్ష్మీనరసమ్మ, నాగమణి, జయప్ప తదితరులు పాల్గొన్నారు.

స్థానిక సంస్థల అభివృద్ధికి సహకరించండి



సౌమ్య కాంతిఘోష్‌కు వినతిని ఇస్తున్న మున్సిపల్ చైర్మన్ రమేష్ కుమార్

ప్రజాశక్తి-హిందూపురం

స్థానిక సంస్థల అభివృద్ధికి 16 వ ఆర్థిక సంఘం ద్వారా పెద్ద ఎత్తున నిధులు మంజూరు చేసి ఆదుకోవాలని మున్సిపల్ చైర్మన్ డిఈ రమేష్ కుమార్ కోరారు. ఈ మేరకు గురువారం తిరుపతిలో జరిగిన 16వ ఆర్థిక సంఘం సమావేశంలో సౌమ్య కాంతి గోష్‌కు వినతి పత్రం సమర్పించారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర స్థానిక సంస్థల అభివద్ధి, నిధుల కేటాయింపు విషయం కోసం 16వ ఆర్థిక సంఘం సమావేశంలో పలు అంశాలపై సుదీర్ఘంగా చర్చించారు. ఈ సమావేశంలో పాల్గొన్న మున్సిపల్ చైర్మన్ డిఈ రమేష్ కుమార్ 16వ ఆర్థిక సంఘానికి పలు ప్రతిపాదనలు చేశారు. 15వ ఆర్థిక సంఘంలో మున్సిపాలిటీలకు కేటాయించిన నిధులలో టైడ్, నాన్ టైడ్ గ్రాంట్లుగా విభజించారని నాన్ టైడ్ గ్రాంట్ లో మున్సిపాలిటీలో అభివృద్ధి కోసం రహదారులు, మురికి కాలువల నిర్మాణానికి ఎటువంటి షరతులు లేకుండా కేవలం అభివృద్ధి పనులకే వాడుకోనేలా మార్పులు చేయాలని సూచించారు. అనేక మున్సిపాలిటీలలో విద్యుత్ చార్జీలు పెనుభారంగా తయారైందని, ఆదాయంలో ఎక్కువ శాతం విద్యుత్ చార్జీలు చెల్లించడానికి సరిపోతోందని, ప్రభుత్వం విద్యుత్ చార్జీల బకాయిలు ఒకే విధానంలో చెల్లించి స్థానిక సంస్థలకు ఊరట కలిగించాలని కోరారు. అలాగే సోలార్ విద్యుత్ ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలన్నారు. జనాభాకు అనుగుణంగా పట్టణాల విస్తరణ అనుగుణంగా ఆర్థిక సంఘం నిధులు కేటాయింపు శాతం పెద్ద ఎత్తున పెంచాలని, తద్వారా అభివృద్ధి చెందుతున్న కొత్త కాలనీలలో మౌలిక సదుపాయాలు కల్పించే అవకాశం స్థానిక సంస్థలకు దక్కుతుందని అన్నారు. అభివృద్ధి పనులలో ప్రభుత్వానికి చెల్లించే 18 శాతం జీఎస్టీ మినహాయింపు ఇవ్వాలన్నారు. మాస్టర్ ప్లాన్ కు అనుగుణంగా జరిగే రోడ్డు విస్తరణలో ఆర్థిక సంఘం నుంచి పెద్ద ఎత్తున నిధులు మంజూరు కోసం పరిశీలన చేయాలన్నారు. ఈ సమావేశంలో సిడిఎంఏ సంపత్ కుమార్, కలెక్టర్లు, ఇతర ఉన్నతాధికారులు, మున్సిపల్ కార్పొరేటర్లు, మున్సిపల్ చైర్మన్లు పాల్గొన్నారు.

ధర్మవరం రెవెన్యూ డివిజన్లో భారీ వర్షం

ప్రజాశక్తి - ధర్మవరం రూరల్

ధర్మవరం రెవెన్యూ డివిజన్ పరిధిలో గురువారం తెల్లవారుజామున భారీ వర్షం కురిసింది. డివిజన్ పరిధిలో 264.8 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదయిందనిదని ఆర్‌డిఓ మహేష్ ఒక ప్రకటనలో తెలిపారు. ధర్మవరంలో 71.6 మిల్లీమీటర్లు, బత్తలపల్లిలో 36.2, తాడిమర్రిలో 41.2, ముదిగుబ్బలో 12.6, కనగానపల్లిలో 75.2, చెన్నేకొత్తపల్లిలో 16.2, రామగిరిలో 11.8 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదు అయిందని తెలిపారు. రెవెన్యూ డివిజన్ పరిధిలో కురిసిన వర్షానికి ఏదైనా పంట నష్టం, ఇల్లు కూలిపోవడం తదితర సమాచారాన్ని ఆయా మండల తహశీల్దార్లు డివిజన్ కార్యాలయంలో తెలపాలని చెప్పారు.

ప్రధాన రహదారుల్లో పేరుకు పోయిన చెత్త : పట్టణంలోని పలు ప్రాంతాలలో గురువారం అర్ధరాత్రి సమయంలో ఉరుములు, మెరుపులతో కురిసిన భారీ వర్షాలకు లోతట్టు ప్రాంతాలతో పాటు ప్రధాన రహదారుల్లో వర్షపు నీరు నిలిచిపోయాయి. ప్రధాన రహదారులమీద చెత్త పేరుకుపోయింది. దీంతో ఆయా వార్డు ప్రజలు ఇబ్బందులు పడ్డారు. గురువారం ఉదయం పారిశుధ్యకార్మికులు కాలువల్లో పేరుకుపోయిన చెత్తను తొలగించే పని చేపట్టారు.



ధర్మవరం ప్రధాన వీధుల్లో పేరుకుపోయి చెత్తను తొలగిస్తున్న దృశ్యం

మెరుగైన వైద్య సేవలందించాలి

ప్రజాశక్తి-హిందూపురం

ప్రభుత్వ అసుపత్రికి వచ్చే రోగులకు మెరుగైన వైద్య సేవలను అందించాలని అనంతపురం డి సి హెచ్ ఎస్ పాల్ రవికుమార్ వైద్యులకు సూచించారు. గురువారం స్థానిక ఎమ్మెల్యే బాలయ్య పీఏ వీరయ్యతో కలిసి పట్టణంలోని స్థానిక జిల్లా ప్రభుత్వ ఆసుపత్రిని డి సి హెచ్ ఎస్ పాల్ రవికుమార్ తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆసుపత్రిలో వార్డులను, ఓపి విభాగాలను, ఫార్మసీ, డయాలసిస్ యూనిట్ ను, నిర్మాణంలో ఉన్న క్రిటికల్ కేర్ యూనిట్ భవన సముదాయాన్ని, అలాగే వార్డుల్లో డాక్టర్లు నర్సులు సిబ్బంది హాజరు పట్టికలను పరిశీలించారు. అదేవిధంగా శిథిలావస్థకు చేరుకున్న మార్చురీని పరిశీలించి వివరాలను సేకరించారు. అనంతరం ఆసుపత్రిలోని సమావేశ మందిరంలో వైద్యులతో సమావేశాన్ని నిర్వహించి వారికి ఎదురవుతున్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అలాగే వైద్యులకు కావలసిన పరికరాలను, మెరుగైన వైద్య సేవలు అందించడానికి కావలసిన సదుపాయాలను వైద్యుల ద్వారా తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఆస్పత్రిలో క్రిటికల్ కేర్ భవనం నిర్మాణం చేస్తుండడంతో పలు రకాల సేవలకు ఇబ్బందులు తలెత్తుతున్నాయన్నారు. మరో ఐదు నెలల్లో ఈ నిర్మాణాన్ని పూర్తిచేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకువస్తామని, తద్వారా మరిన్ని వైద్య సేవలు ప్రజలకు అందించగలుగుతామని అన్నారు. ఆసుపత్రిలో టార్గెట్ మేరకు సాధారణ ప్రసవాలు జరిగే విధంగా చర్యలు తీసుకోవాలని వైద్యులకు సూచించారు, అత్యవసర పరిస్థితుల్లో సిజేరియన్ చేయాలన్నారు. చిన్న పిల్లలకు ఎలాంటి అసౌకర్యం కల్పించకుండా వైద్యం అందించాలని, వార్డుల్లో ఇన్ పేషంట్ సేవలు పెరగాలని ఆదేశించారు. ఆస్పత్రిలో అందించే ప్రతి చికిత్సను ఎన్టీఆర్ వైద్య సేవ కింద నమోదు చేయాలన్నారు. ఆస్పత్రి లో ప్రతి ఒక్కరూ వారి షిఫ్టుల సమయం ప్రకారం ఎఫ్ఆర్ఎస్‌ను, ఇన్ అండ్ అవుట్‌ను ఆసుపత్రి ఆవరణలోనే వెయ్యాలని సూచించారు. సమయపాలన పాటించని వారిపై చర్యలు తప్పవని హెచ్చరించారు. సిబ్బంది కొరత తమ దృష్టికి వచ్చిందని వైద్యులను నియమించేందుకు ఇప్పటికే నోటిఫికేషన్ విడుదల చేశామని చెప్పారు. నెల రోజుల్లో ఆసుపత్రిలో ఖాళీగా ఉన్న అన్ని పోస్టులను భర్తీ చేస్తామని తెలియజేశారు. రక్త నిధి కేంద్రంలో అన్ని పరికరాలను అందుబాటులోకి తీసుకొచ్చేందుకు కషి చేస్తామని తెలిపారు. డయాలసిస్ లో ఏసీలు పనిచేయకపోవడంతో రోగులు ఇబ్బందులు పడుతుండడంపై సిబ్బందిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. రెండు రోజుల్లో ఏసీలను అందుబాటులోకి తీసుకురావాలని ఆదేశించారు.. వైద్యులు సిబ్బంది పనితీరులో మార్పు రావాలని రోగుల వద్ద డబ్బులు డిమాండ్ చేయడం వంటివి చేస్తే వారిపై చర్యలు తీసుకుంటామని అలాంటి వారిని ఇంటికి పంపుతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో మెడికల్ సూపరింటెండెంట్ లింగన్న, వైద్యులు పాల్గొన్నారు.



వీరయ్యతో కలిసి వైద్యులతో మాట్లాడుతున్న డిసిహెచ్ఎస్ పాల్ రవికుమార్

వ్యక్తిపై దాడి కేసులో ఐదుగురికి జరిమానా

ప్రజాశక్తి-రొద్దం

ఓ వ్యక్తిపై దాడి చేసిన కేసులో ఐదుగురు నిందితులకు రూ. 6వేల చొప్పు జరిమానా విధిస్తూ గురువారం పెనుకొండ ప్రిన్సిపల్ జ్యుడిషియల్ ఫస్ట్ క్లాస్ మేజిస్ట్రేట్ మసాలా బొజ్జప్ప తీర్పు ఇచ్చారు. ఎస్ఐ నరేంద్ర తెలిపిన వివరాలు.. రామగిరి మండలంలోని కనికివాండ్లపల్లి గ్రామానికి చెందిన ఎం.గంగన్న కుమారుడు ఎం.శివశంకర్ మండలంలోని రాచూరు గ్రామానికి చెందిన అంజనరెడ్డి కుమార్తె కురుబ రోజాను 2014లో వివాహం చేసుకొన్నాడు. ఆ తర్వాత రోజా కాన్పుకి పుట్టింటికి రావడంతో శివశంకర్ అత్తగారి ఇంటికి వచ్చి వెళ్లేవాడు. ఈ క్రమంలో 2015 ఆగస్టులో శివశంకర్ అత్త సుశీలమ్మతో ఆరు బయట మాట్లాతుండగా రాచూరు గ్రామానికి చెందిన గొల్ల ధనుంజయ, రవి, సుధాకర్, పరంధామ, బోయ శ్రీరాములు వారి విషయంలో కలుగజేసుకొని శివశంకర్‌పై దాడి చేసి కొట్టారు. దీంతో బాధితుడు శివశంకర్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా అప్పటి ఎస్ఐ దస్తగిరి కేసు నమోదు చేసి దర్యాప్తు అనంతరం కోర్టులో ఛార్జిషీట్ వేశారు. జడ్జి కేసు పూర్వాపరాలను పరిశీలించి నేరం రుజువు కావడంతో ఐదుగురు నిందితులకు ఒక్కొక్కరికి రూ. 6వేల చొప్పు జరిమానా విధిం చారు. జరిమానా కట్టనిచో అదనంగా 6 నెలల జైలు శిక్ష విధిస్తూ తీర్పు వెలువరించారు. ఈ కేసులో బాధితుల తరపున పెనుకొండ అసిస్టెంట్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ ఎం.శ్యామల వాదించారు. సాక్షులను ప్రవేశపెట్టిన కోర్ట్ కానిస్టేబుల్ ఎస్.బాబ్‌జాన్‌ను ఎస్పీ అభినందించినట్లు ఎస్ఐ తెలిపారు.

ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన విద్య

ప్రజాశక్తి-పావగడ

ప్రభుత్వ పాఠశాలల్లో అన్ని సౌకర్యాలతో పాటు నాణ్యమైన విద్యనందిస్తారని కావున ప్రతి తల్లిదండ్రులు పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లోనే చేర్పించాలని క్షేత్ర విద్యాశాఖ అధికారిణి ఇంద్రాణమ్మ కోరారు. పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల(హైస్కూల్ డివిజన్) ఆవరణలో గురువారం తాలూకా స్థాయి 'మన పాఠశాల–మన బాధ్యత' కార్యక్రమం నిర్వహించారు. ఇంద్రాణమ్మ మాట్లాడుతూ ప్రభుత్వం ప్రయివేటు పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలల్లో అనేక పథకాలు అమలు చేస్తోంద న్నారు. ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల్లో ప్రభుత్వ పాఠశాలల్లో ఉన్న సౌకర్యాలపై ఉపాధ్యాయులు అవగాహన కల్పించి ఎక్కువ మంది పిల్లలు చేరేలా చూడాలన్నారు. అక్షర దాసోహ సహాయ సంచాలకులు శంకరప్ప మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో మధ్యాహ్నం భోజనం, పాలు, కోడిగుడ్లు, అరటిపండ్లు ఇస్తారని, విద్యార్థుల ఎదుగుదలకు అవసరమయ్యే కార్యక్రమాలు నిర్వహిస్తుందన్నారు. వైస్ ప్రిన్సిపల్ లక్ష్మీనరసమ్మ మాట్లాడుతూ నైపుణ్య ఆధారిత విద్య(ఎన్ఎస్‌క్యూఎఫ్)తో పాటు ఇంగ్లీష్, కన్నడ మాధ్యమంలో విద్యనందిస్తున్నామన్నారు. కార్యక్రమంలో బిఆర్‌పి.మురుగేష్ గచ్చిన మఠ్, ఈశ్వర్‌నాయక్, ప్రిన్సిపల్ రామకృష్ణయ్య, హెచ్‌ఎం భాగ్యలక్ష్మి, ఇసిఒ శివకుమార్, పురపాలక సంఘం సభ్యులు, ఉపాధ్యాయులు, తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదాల నివారణకు చర్యలు

ప్రజాశక్తి - కదిరి టౌన్

కదిరి పట్టణంలో మౌనిక హాల్ ఎదురుగా కదిరి – చెన్నై జాతీయ రహదారి పై రోడ్డు ప్రమాదాల నివారణకు టిడిపి నాయకులు చర్యలు చేపట్టారు.ఈ ప్రాంతంలో రోడ్డు దాటాలంటే తరచూ ప్రమాదాలకు గురికావాల్సి వస్తుందని స్థానిక ప్రజలు ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్ దృష్టికి తీసుకురావడంతో స్పందించిన ఎమ్మెల్యే జాతీయ రహదారి పై స్పీడ్ బ్రేకర్లు వేయాలని టీడీపీ నాయకులు కృష్ణమోహన్ నాయుడు కి సూచించారు. దీంతో నియంత్రణ చర్యలు చేపట్టారు. దీంతో స్థానిక ప్రజలు హర్షం వ్యక్తం చేశారు.

వేసవి విజ్ఞాన శిక్షణ శిబిరం

ప్రజాశక్తి - చిలమత్తూరు

మండల కేంద్రంలోని శాఖా గ్రంథాలయంలో గ్రంథాలయాధికారి ఆర్. మల్లికార్జున నేతృత్వంలో జరుగుతున్న వేసవి విజ్ఞాన శిక్షణ శిబిరం గురువారానికి 15వ రోజుకు చేరుకుంది. ఈ సందర్భంగా జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి పి. రమా తనిఖీ నిర్వహించి శిబిర నిర్వహణపై సంతృప్తి వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఎంపీడీవో రమణమూర్తి, లెక్చరర్ షానవాజ్, డ్రాయింగ్ మాస్టర్ వేణుగోపాల్ తదితరులు పాల్గొన్నారు. విద్యార్థులు పుస్తక పఠనం, నీతి కథలతో సందడి చేశారు. క్యారమ్స్, చెస్, స్నేక్ అండ్ లాడర్ వంటి ఆటలు నిర్వహించగా పాఠకులు, విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు.

గందరగోళంగా ఉపాధ్యాయుల బదిలీల ప్రక్రియ

ప్రజాశక్తి - పుట్టపర్తి క్రైమ్

ఉపాధ్యాయుల బదిలీల ప్రక్రియ అంతా అస్తవ్యస్తంగా గందరగోళంగా ఉందని వైఎస్ఆర్ టీచర్స్ అసోసియేషన్ అధ్యక్ష కార్యదర్శులు పి.వి. రమణ రెడ్డి, ఇందిరా లీల విమర్శించారు. ఈ మేరకు వారు గురువారం ఒక ప్రకటన విడుదల చేశారు. గత ఐదు నెలల నుంచి ఉపాధ్యాయ సంఘాలతో సమావేశాలు నిర్వహించి, వారి అభిప్రాయాలను తీసుకున్నట్లు నమ్మించి ప్రభుత్వం దగా చేసిందన్నారు. 117 జీవో రద్దు అనేదానికి ప్రత్యామ్నాయంగా దారుణమైన నిబంధనలు ప్రవేశపెడుతున్నారన్నారు. ఉన్నత పాఠశాలలో 1:45 నిష్పత్తి ప్రకారం ఒక సెక్షన్ పెట్టకుండా దాదాపు 5 మంది స్కూల్ అసిస్టెంట్లు పోస్టు మిగులుగా చూపించి వారిని ప్రాథమిక పాఠశాల ప్రధాన ఉపాధ్యాయులుగా పంపి సీనియార్టీ ఉన్న ఎస్ జి టి లకు ప్రమోషన్ లేకుండా అన్యాయం చేస్తున్నారన్నారు. ముందు మాతృభాషను పరిరక్షించాలని చెప్పిన ప్రభుత్వం ఇప్పుడు రెండు మీడియంలుఉండాలంటూ చెబుతోందన్నారు. బదిలీ నిబంధనలో మార్పు చేసి ఉపాధ్యాయ విద్యార్థి నిష్పత్తి తగ్గించి రెండు మీడియంలో ప్రవేశపెట్టాలని, ఉపాధ్యాయుల సమస్యలను ప్రభుత్వం అధికారులు సానుకూలంగా స్పందించాలని వారు డిమాండ్ చేశారు.

వీర జవాన్ స్మారక క్రికెట్ టోర్నీ ప్రారంభం

ప్రజాశక్తి - చిలమత్తూరు



టోర్నీ ప్రారంభ కార్యక్రమంలో యువత

మండలంలోని కోడూరు గ్రామంలో వీర జవాన్ మురళీ నాయక్ జ్ఞాపకార్థంగా కోడూరు యూత్ ఆధ్వర్యంలో క్రికెట్ టోర్నమెంట్‌ను గురువారం ప్రారంభించారు. దేశం కోసం ప్రాణత్యాగం చేసిన మురళీ నాయక్‌కి క్రీడాకారులు, యువత పుష్పమాలలతో నివాళులు అర్పించారు. ప్రారంభోత్సవ కార్యక్రమం దేశభక్తి, సేవా భావానికి నిదర్శనంగా నిలిచింది. మురళీ నాయక్ ఆదర్శాలను యువత అనుసరించాలని నిర్వాహకులు పిలుపునిచ్చారు. టోర్నమెంట్‌లో పలు స్థానిక జట్లు ఉత్సాహంగా పాల్గొన్నాయి. ఈ కార్యక్రమంలో ఫిరంగి ప్రవీణ్, నరేష్, అశోక్, మధు, పి.నరేష్ తదితరులు పాల్గొన్నారు.